క్లుప్తంగా

మేడే విజయవంతం చేయాలి



మేడే కరపత్రాలను ఆవిష్కరించిన హమాలీల సంఘ నాయకులు

సామర్లకోట: మేడేను విజయవంతం చేయాలని ఏపీ బేవరేజ్ హమాలీల సంఘం రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు పిలుపునిచ్చారు. స్థానిక బెవరేజ్ డిపోలో స్థానిక సంఘ అధ్యక్షుడు నాళం సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. 8 గంటల పని దినాలను సాధించుకోవడం ద్వారా ఏటా మేడే నిర్వహించుకుంటున్నట్టు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు తదితరులు మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. హమీలీల సంఘ కార్యదర్శి వి.అప్పలరాజు, కోశాధికారి బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



యండపల్లిలో వెలుగుతున్న వీధి దీపాలు

కొత్తపల్లి: గ్రామాల్లో పట్టపగలే విద్యుత్ వెలుగుతున్నాయి. రాత్రీ పగలు తేడా లేకుండా వెలగడంతో విద్యుత్ బిల్లులు వేలల్లో వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. యండపల్లిలో విద్యుత్‌ను ఆదా చేయవలసిన అధికారులు పట్టించుకోవడంతో ఎప్పుడూ వీధిలైట్లు వెలుగుతునే ఉన్నాయంటున్నారు. అధికారులు స్పందించి వీధిదీపాల నిర్వహణపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత పేర్కొన్నారు. మండల పరిధిలోని జి.మేడపాడు గ్రామంలోని ఇళ్ల లబ్ధిదారులతో ఆమె గురువారం సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకుని సొంతింటి కలను నిజం చేసుకోవాలన్నారు. వలంటీర్లు లబ్ధిదారులకు అవగాహన పెంచాలన్నారు. వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, ఏఈ వెంకటేశ్వరరావు, తూర్పుకాపు సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

సామర్లకోట: అంబేడ్కర్ అందరివాడిగా గుర్తించేలా స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని నాలుగోవార్డు కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న వనరుల కేంద్రంలో గురువారం పాఠశాలలో జరిగే సామాజిక తనిఖీపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక అవసరాల గల పిల్లల కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్, రిసోర్స్ పర్సన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమతో అధికాదాయం : కలెక్టర్

కాకినాడ సిటీ: జిల్లాలో మెట్టప్రాంత రైతులు బోరు కింద వ్యవసాయం చేసే వారు పట్టు పరిశ్రమను చేపట్టి అధిక ఆదాయం పొందాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో పట్టు పరిశ్రమశాఖకు సంబంధించి పోస్టర్లను జిల్లా పట్టు పరిశ్రమ అధికారి బీఎంవీ రామరాజుతో కలసి విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. పట్టు పరిశ్రమ వల్ల రైతులకు, డీలర్లుకు, వీవర్స్‌కు, చేనేత కార్మికులకు అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. మల్బరీ తోటలు కొత్తగా నాటే రైతులకు ఎకరానికి రూ.25 వేలు యూనిట్ విలువపై 75 శాతం సబ్సిడీ రూ. 18,750 అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క రైతుకు సబ్సిడీ 5 ఎకరాలకు మంజూరు చేస్తారన్నారు. ఈ పథకాలకు సంబంధించి సబ్సిడీ ధనం నేరుగా లబ్ధిదారుల ట్రాన్స్‌ఫర్ ద్వారా మాత్రమే రైతు ఖాతాలో జమ చేస్తారని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు.

నైపుణ్యాభివృద్ధిపై మత్స్యకారులకు శిక్షణ

కాకినాడ రూరల్: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులు నైపుణ్యాభివృద్ధిపై కాకినాడ ఎస్ఐఎఫ్‌టీలో మూడు రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. కమ్యూనికేషన్ అండ్ నావిగేషనల్ ఎక్విప్‌మెంట్ ఆన్ బోట్ ఫిషింగ్ వెసెల్ అనే అంశంపై విశాఖపట్నంలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రైనింగ్ (సిఫ్‌నెట్) యూనిట్ అధికారులు శిక్షణను అందించారు.

ఎండలు.. జరభద్రం..!

- వేసవి తాపంతో విలవిల్లాడుతున్న ప్రజలు
- చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్న వైద్యారోగ్య శాఖ
- గ్రామాల్లో ఓఆర్ఎస్ క్యాంపెయిన్లు, అవగాహన సదస్సులు



ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండల నుంచి రక్షణ పొందేలా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల్లో ముఖ్య కూడళ్లు, రచ్చబండల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు వడదెబ్బ నుంచి రక్షణ ఎలా పొందాలనే విషయంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గొల్లప్రోలు మండల పీహెచ్‌సీ డాక్టర్ డి.శ్యామల, హెల్త్ సూపర్ వైజర్ అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు జనం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఓఆర్ఎస్ క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఎండలో పని చేసే ఉపాధి కూలీలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి వారిలో అవగాహన పెంచుతున్నారు. ఎండలో పని చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ లక్షణాలు, ముందుగా చేయాల్సి ప్రథమ చికిత్స తదితర విషయాలు వివరిస్తున్నారు. మరో పక్క సీజనల్ వ్యాధులు జ్వరం, జలుబు, విరోచనాలు, వాంతులు వంటివి విజృంభించే అవకాశం ఉండడంతో ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు ప్రతీ గ్రామంలోను వివరిస్తున్నారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఇప్పటికే గొల్లప్రోలు మండలంలో పలు గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆరోగ్య ఉప కేంద్రాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశాం. ఉపాధి పనులు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో ఓఆర్ఎస్ క్యాంపెయిన్స్ నిర్వహించాం. ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం.

– అహ్మద్ బాషా,
హెల్త్ సూపర్‌వైజర్, గొల్లప్రోలు



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ లైన్లపై ఉన్న చెట్టు కొమ్మలను తొలగిస్తున్న కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ప్రసాద్ గురువారం తెలిపారు. మూలపేట, శ్రీలంవారిపాలెం, అమరవల్లి, రామన్నపాలెం, తమ్మయ్యపేట, పొన్నాడలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

సామర్లకోటలో...

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లోని 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ జి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



శిబిరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణబాబు తదితరులు

పెద్దాపురం: పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో వచ్చే నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి అన్నారు. స్థానిక వరహాలయ్య పేట యాసలపు సూర్యారావు భవనంలో గురువారం వేసవి శిబిరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా కార్యదర్శి బుద్దా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరం కో-ఆర్డినేటర్ కూనిరెడ్డి అరుణ మాట్లాడుతూ వచ్చే నెల ఐదో తేదీలోగా 94417 09187, 79016 97939 నెంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ కలెక్టర్



వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖార్ జైన్

సామర్లకోట: అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖార్ జైన్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ విధులపై నాలుగు వారాలుగా పొందుతున్న శిక్షణ గురువారంతో ముగిసింది. కార్యాలయ సిబ్బంది ఆయనను సత్కరించి వీడ్కోలు పలికారు. ప్రఖార్ జైన్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో అనేక విషయాలు తెలుసుకున్నానని, తనకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీనివాసరావు, ఆర్ఐ ఎం.రాజేష్, వీఆర్వోలు పాల్గొన్ని వీడ్కోలు పలికారు.

నవధాన్యాల సాగుతో భూమికి బలం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు

పిఠాపురం: వేసవిలో ఖాళీగా ఉన్న భూముల్లో నవ ధాన్యాల సాగు చేపట్టడం వల్ల భూమిని సారవంతంగా చేసుకోవచ్చని, తద్వారా మంచి దిగుబడి రాబట్టవచ్చని జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు రైతులకు సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కాకినాడ జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో నవ ధాన్యాల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది నవ ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డివిజనల్ యాంకర్ ఎం.చంద్రరావు, యూనిట్ ఇన్‌చార్జి రాంబాబు, ఈశ్వరుడు, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నాలుగు అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ ఉష తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెల 8వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామని, పెద్దాపురం మండలం ఆర్‌బి పట్నంలో (ఓసీ జనరల్) పులిమేరులో (బీసీ డీ), కిర్లంపూడి మండల ఎస్ఆర్ పాలెం (బీసీ ఈ) ఏలేశ్వరం మండలం యర్రవరంలో (ఎస్సీ) కేటగిరి అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 35 ఏళ్లలోపు వయస్సు గలవారు దరఖాస్తు చేసుకోవచ్చాను.

ఆయా పోస్టులకు..

సామర్లకోట: స్థానిక ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు పరిధిలో ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ జీవీ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని నవర కొత్త కాలనీ, చంద్రంపాలెంలోని ఎస్సీ ఏరియా, పెదపూడిలోని రజకపేటలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. వచ్చేనెల 8వ తేది లోపుగా రూరల్ ప్రాజెక్టులో దరఖాస్తులు అందజేయవలసి ఉంటుందని తెలిపారు. స్థానికులై, 10వ తరగతి అర్హత కలిగి, 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు.

ప్రజలు మెచ్చేలా పనులు చేయాలి

- సర్పంచ్, ఎంపీటీసీలకు జెడ్పీటీసీ గవరసాని సూచన
- పార్టీ రహితంగా సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం
- సమస్యలు, ప్రగతిపై మండల సమావేశంలో చర్చ



స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వివరిస్తున్న కాండ్రకోట సర్పంచ్ శ్రీనివాస్

పెద్దాపురం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సర్పంచ్, ఎంపీటీసీలు పని చేయాలని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. పెద్దాపురం మండల పరిషత్ సమావేశం గురువారం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలు మెచ్చే నాయకుడిలా పని చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా, అభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు పనిచేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ఎంపీపీ పెంకే సత్యవతి మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. తిరుపతి ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు తమ గ్రామంలో నీటి ట్యాంకు సామర్థ్యం పెంచాలని, కాండ్రకోట సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు గ్రామ రహదారి మలుపుల్లో ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు వేయించాలని, రహదారుల వెంబడి తుప్పలు తొలగించాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ హిమమహేశ్వరి అక్కడికక్కడే తుప్పలు తొలగించాలని ఏపీఓ స్వామిని ఆదేశించారు. తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లూరి జ్యోతి, మండల కో-ఆప్షన్ సభ్యులు బిక్కిన శేష వీరకుమారి, హౌసింగ్ చైర్మన్ పీఎస్ రాజశేఖర్, మండల విస్తరణాధికారి మూర్తి, ఎంఈఓ సత్యనారాయణ, వ్యవసాయ శాఖ ఏఓ సంజయ్‌కుమార్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సస్య రక్షణతో రూగోస్ నివారణ



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త చలపతిరావు

పెద్దాపురం: రైతులు సమగ్ర యాజమాన్య సస్య రక్షణ పోషక పద్ధతులు పాటించాలని అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం కొబ్బరి, ఆయిల్‌పామ్ సాగు రూగోస్ తెల్లదోమ నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ సమగ్ర సస్య రక్షణపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి బీవీ రమణ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 11 వేల హెక్టార్లలో కొబ్బరి, ఆయిల్ పామ్ సాగవుతోందన్నారు. రూగోస్ వల్ల వీటి దిగుబడి తగ్గుతుందన్నారు. ఉద్యాన శాఖాధికారి సుజాత తెల్లదోమ నివారణ పద్ధతులను వివరించారు. హార్టికల్చర్ వీహెచ్ఏ ఎం.చిలకమ్మ, పతంజలి ఫుడ్స్ డీజీఎం రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

సామర్లకోట: నవోదయలో ప్రవేశం కోసం శనివారం నిర్వహిస్తున్న పరీక్షలకు స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌ను ఒక సెంటర్‌గా ఎంపిక చేసినట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్‌లో 325 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నవోదయలో ఆరో తరగతిలోకి ప్రవేశం లభిస్తుందన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెరిగిన ఉత్తీర్ణత



ప్రశాంత్



మల్లికాదేవి



ఎ రజని



ఎల్ మౌనిక

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఏడాది కంటే ఉతీర్ణత శాతం పెరిగింది. ఈ మేరకు ఇంటర్ పరీక్ష పలితాలను ప్రిన్సిపాల్ టి శ్రీరామమూర్తి గురువారం స్థానిక విలేకర్లకు వివరించారు. ఇంటర్ మొదటి సంవత్సరం సాధారణ కోర్సుల్లో 68 మందికి 27 మంది పాస్ కాగ 40 శాతం ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్‌లో 81 మందికి 42 మంది పాస్ కాగా 52 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో సాధారణ కోర్సుల్లో 110 మంది పరీక్షలు రాయగా 57 మంది పాసై 52 శాతం ఉతీర్ణత సాధించారు. వొకేషనల్‌లో 92 మందికి 47 మంది పాసై 51 శాతం ఉతీర్ణత సాధించారు. డీఆర్ఆర్ ఎస్ఎస్ ప్రశాంత్, వొకేషనల్ (ఎంఎటీలో) వెయ్యి మార్కులకు 969, కె.మల్లికాదేవి ఎంపీసీలో 950, ఎ.రజని ఎంపీసీలో 939 మార్కులు, ఎల్.మౌనిక హెచ్ఈసీలో 842 సాధించినట్టు ప్రిన్సిపాల్ వివరించారు.

విద్యార్థికి కమిషనర్ అభినందన



అమూల్యను అభినందిస్తున్న కమిషనర్, సిబ్బంది

సామర్లకోట: ఇంటర్ పరీక్షా ఫలితాలల్లో 983 మార్కులు సాధించిన పాదుగు అమూల్యను మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ గురువారం అభినందించారు. మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగి పాదుగు చిట్టిబాబు కుమార్తె అయిన అమూల్యకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీర్ కావడమే తన లక్ష్యమని ఆమె పేర్కొంది. మున్సిపల్ మేనేజరు అచ్చుతరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్తా చాటిన సర్కార్ కళాశాల బాలికలు



కె కృష్ణవేణి



జె రేణుక



మొగలి బంగారం



షేక్ ఆలీషాబేగం



నేపాల మోషే

పిఠాపురం: ప్రైవేట్ కళాశాలలను తలదన్నేలా ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు తమ సత్తా చాటారు. ప్రభుత్వ కళాశాలల్లో మెరుగుపడిన సౌకర్యాలతో పైసా ఫీజు లేకుండా చదువుకుని టాపర్లుగా నిలిచి ప్రభుత్వ కళాశాలలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెస్తున్నారు పిఠాపురం, గొల్లప్రోలు ప్రభుత్వ కళాశాలల విద్యార్థినులు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కృష్ణవేణి హెచ్ఈసీ 931 మార్కులు, జె.రేణుక ఐసీఎస్‌సీ 960, ఎల్.రాజీ ఐబీపీసీ 440 మార్కులకు 375 సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షల్లో 277 మందికి 134 మంది (50.6 శాతం) పాసయ్యారు. ప్రథమ సంవత్సరంలో 283 మందికి 89 మంది (33.9 శాతం) ఉత్తీర్ణలయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు తెలిపారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు ప్రభుత్వ కళాశాలల ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు మొగలి బంగారం 965, షేక్ ఆలీషాబేగం 957, నేపాల మోషే 940, కరణం రాజేశ్వరి 927, మామిడాల ఉమా నాగేశ్వరి 924 మార్కులు సాధిచి తమ సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో సానా దేవి 441, వెన్నా మణికంఠ 437, పావని 429, సీఈసీలో మొండి జ్యోతి 441, కీర్తి గంగా మహాలక్ష్మి 423 మార్కులు సాధించారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి వల్ల మంచి ఫలితాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కేపీఎస్ రాజశేఖర్ తెలిపారు.

భగీరథ మహర్షి విగ్రహం ఏర్పాటు

దర్శించుకున్న పలువురు ప్రజాప్రతినిధులు



భగీరథ మహర్షిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: ఇసుకపల్లి శివారు ఉప్పరగూడెంలో భగీరథ మహర్షి జయంతిని గురువారం సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా, సగర సంఘం, గ్రామపెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహం, నూతనంగా నిర్మించిన మండపాన్ని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావులు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు, కేక్ కట్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో సుమారు మూడు వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సగరసంఘం సభ్యులు సన్నిబోయిన ఎలీషా, గుల్లపల్లి వీరభద్రరావు, గుళ్లపల్లి అప్పారావు, సాదరబోయిన లింగాలస్వామి, ఎంపీటీసీ గుర్రాల మంగతాయరు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి

సామర్లకోట: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం భగీరథ మహర్షి జయంతిని నిర్వహించారు. భగీరథుని చిత్రపటానికి నివాళులర్పించి ఆయన జీవిత చరిత్రను ఎంపీడీఓ డి శ్రీలలిత వివరించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ వై.శ్రీహరి, పరిపాల నాధికారి పి.సాయిబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం: భగీరథ మహర్షి జయంతిని పెద్దాపురం అర్బన్, రూరల్ మండలాల పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా తదితరులు మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కఠోరమైన దీక్షతో దివి నుంచి భువికి గంగను రప్పించిన ఘనత మహర్షిదేనన్నారు. ప్రతి ఒక్క విషయంలో పట్టుదల ఉంటే సాధించలేనిది ఉండదని మహర్షి నిరూపించారన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎంపీడీఓ ఉమా మహేశ్వరి, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, ఎంపీటీసీలు పాకనాటి నాగలక్ష్మి, జాగు వీరభద్రరావు, కాలే అనురాధ, గుండేపల్లి భద్రం, నల్లల గోవిందు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

దైవకార్యం నర్సింగ్

కాకినాడ క్రైం: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సేవలందించే నర్సింగ్ ఓ దైవకార్యమని ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక డి-కన్వెన్షన్ హాల్లో కాకినాడ అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో సీఈఓ ఐవీ రమణ అధ్యక్షతన నర్సులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ గీత హాజరు కాగా, డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, ఇండియన్ రీసక్సియేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్ చక్రరావు, జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ కామేశ్వరరావు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ గీత మాట్లాడుతూ, మదర్ థెరిసా, ఫ్లోరెన్స్ నైటింగేల్ వంటి సేవా మూర్తులు నర్సింగ్ సేవలకు వన్నె తెచ్చారన్నారు. నర్సుల నైపుణ్యాలను వృద్ధి చేసేందుకు జరుగుతున్న శిక్షణ తరగతులు ఎంతో ప్రయోజనకరమని, ఆసుపత్రి యాజమాన్యం చొరవను అభినందించారు. ఐవీ రమణ మాట్లాడుతూ నర్సింగ్ శిక్షణ ఇక్కడే తొలిసారిగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డాక్టర్లు చక్రరావు, కామేశ్వరరావు మాట్లాడుతూ వైద్య సేవలకు నర్సులు వెన్నెముక అన్నారు. అపోలో ప్రతినిధి మూర్తి మాట్లాడుతూ ఈ శిక్షణకు 500 మంది నర్సులు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ కౌన్సిల్ రిజిస్టర్ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ డాక్టర్ వల్లి, డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ అపోలో ఆసుపత్రి కాకినాడ కెప్టెన్ మధుకర్, కాకినాడ అపోలో ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీపీ చటర్జీ పాల్గొన్నారు.

డీసీసీబీ ఉద్యోగుల బాధ్యతల స్వీకరణ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడకు బదిలీపై వచ్చిన డీసీసీబీ అధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. జనరల్ మేనేజర్లు నన్నపనేని రంగబాబు, కె.శ్రీనివాసులు, డీజీఎం జీఎస్‌వీ సత్యనారాయణ విధుల్లో చేరారు. తొలుత సీఈఓ ఆర్‌వీ నరసింహారావును మర్యాద పూర్వకంగా కలుసుకుని బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన జీఎంలు, డీజీఎంలను పలువురు ఉద్యోగులు అభినందించారు.

రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడిగా పల్లయ్య

కాకినాడ రూరల్: రేషన్ డీలర్ల సంఘ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని వలసపాకల గ్రామానికి చెందిన డీలర్ నందిపాటి పల్లయ్య ఎన్నికయ్యారు. వివిధ మండలాల నుంచి వచ్చిన రేషన్ డీలర్లు గురువారం రమణయ్యపేటలో సమావేశమై సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి విన్నవించాలని తీర్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కాశీరాజు, ప్రధాన కార్యదర్శిగా రాంపండు, సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. అనంతరం వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.